

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 సంచిక : 7 మార్చి 2007


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-12-2006, కాకినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధనం సంపాదించటం కంటే, కీర్తి సంపాదించటం కంటే, అధికారం సంపాదించటం కంటే, సహృదయాన్ని సంపాదించటం చాలా కష్టం. లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఇలా మనకు రకరకాల వాసనలు ఉండవచ్చు. మనం ఎంతో కష్టపడి సాధన చేస్తేగాని ఈ వాసనల నుండి బయటకు రాలేము. మనకు 100 వాసనలు ఉంటే 99 వాసనలు జయించి, ఒక్క వాసన మిగిలి ఉన్నా అది పునర్జన్మను తీసుకొని వస్తుంది. మనం ఎన్ని శాస్త్రాలు చదివినా మనకు సహృదయం లేకపోతే అవి మనకు సరిగా అర్థం కాదు. చదివితే పాండిత్యం రావచ్చు గాని అది మన గుండెలోకి దిగదు, మనకు మారుమనస్సు రాదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే శాస్త్రాలు చదివితే సరిపోదు, సహృదయం సంపాదించుకోవాలి, వివేకం పెంచుకోవాలి. వైరాగ్యం లేకపోతే భగవద్గీత చదివినా అందులోని మాటలు అబద్ధం అనిపిస్తుంది, భగవంతుడు చెప్పాడు అని పైకి అనిపించినా లోపల అంగీకరించదు. మనకు వైరాగ్యం లేదు, వివేకం లేదు, పుణ్యబలం లేదు, సత్పురుషులతో సహవాసం లేదు. మనకు ఏ బలం లేదు, ఇందులో ఏ బలం ఉన్నా సరిపోతుంది. తపస్సు అంటే మనస్సును ఎంతవరకు నిగ్రహించుకోగలరో అంతవరకు నిగ్రహించుకోవాలి, ఇంద్రియాలను కంట్రోలులో ఉంచుకోవాలి. అన్ని ఇంద్రియాలు, మనస్సు పూర్తిగా సహకరించకుండా ఎవడికి ఆత్మజ్ఞానం కలుగదు. మనకు తెలిసినా, తెలియకపోయినా మన


రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


కాకినాడ............ 17-12-06
మల్కిపురం ........ 21-01-07
కాపవరం .......... 19-01-07



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

హృదయంలో ఒక సత్యం ఉంది. ఆ సత్యాన్ని తెలుసుకొనే జ్ఞానమే నిజమైన జ్ఞానం. అది నీ మనస్సుకు అందదు, నీ ఇంద్రియాలకు అందదు, అది అనుభవైకవేద్యం, అది నీ అనుభవానికి అందుతుంది, దాని తాలుక అనుభవం నీవు పొందినప్పుడు దాని గురించి నీకు తెలుస్తుంది, అంతవరకు నీకు తెలియదు. రామకృష్ణ పరమహంస గారు ఒక కథ చెప్పారు. ఇరుగు పొరుగు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. ఒక అమ్మాయికి పెళ్ళి అయ్యింది. అమ్మాయి భర్త అత్తవారింటికి వస్తూ ఉండేవాడు. పెళ్ళి అవ్వని అమ్మాయి ఏమి అడిగింది అంటే నీ భర్త ఎక్కువగా వస్తున్నాడు, మీరు ఇద్దరు కలుసుకొంటున్నారు, మీరు పొందే ఆనందం ఏమిటి అని అడిగింది. పెళ్ళి అయిన అమ్మాయి స్నేహితురాలితో ఏమి చెప్పింది అంటే నీకు ఇంకా పెళ్ళి అవ్వలేదు. నా భర్త వలన నేను ఇటువంటి సుఖాన్ని పొందుతున్నాను అని నోటితో నీకు చెప్పినా అర్థం కాదు. నీకు భర్త వచ్చాక ఇప్పుడు భర్త వలన నేను ఏ సుఖాన్ని పొందుతున్నానో నీవు కూడా ఆ సుఖాన్ని పొందుతున్నప్పుడు దాని గురించి నీకు తెలుస్తుంది కాని ఇప్పుడు నేను చెప్పటం వలన నీకు ఏమీ తెలియదు అని చెప్పింది. అలాగే మీరు ఆత్మానుభవాన్ని పొందినప్పుడు ఆత్మ యొక్క వైభవం గురించి మీకు తెలుస్తుంది. చదవటం, వినటం, మననం చేసుకోవటం మంచిదే. కాని విన్న దానిని, చదివిన దానిని మీరు అనుభవంలోనికి తెచ్చుకొన్నప్పడే దాని గురించి మీకు తెలుస్తుంది.

మంచి చెడ్డ, ఎక్కువ తక్కువ ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సును దాటితే బేదబుద్ధి నశిస్తుంది, అక్కడ ఏమీ తేడా ఉండదు, అంతా ఒక్కటే. మనకు జ్ఞానం ఎందుకు రావటం లేదు, మనకు జ్ఞానం రాకుండా ఏది అడ్డువస్తోంది అని మనం విచారణ చేసుకోవాలి. ఇలా విచారణ చేసుకోవటం మానివేసి ఎంతసేపు లోకం గొడవలతో ఉంటున్నాము, ఎవరో ఒకరిని విమర్శిస్తూ ఉంటాము. ఇతరుల గొడవ వద్దు, నీ లోపల ఉన్న బలహీనతలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పుడు నీవు బాగుపడతావు. వినయసంపద లేకపోతే హృదయంలో ఉన్న అమృతం నీకు దొరకదు. మనకు ఉండ వలసినంత వైరాగ్యం, వివేకం, అభ్యాసం, తెలుసుకోవాలనే కాంక్ష లేకపోతే మీరు ఏదైనా అధ్యయనం చేస్తూ ఉన్నా దాని వలన పెద్ద ప్రయోజనం ఏమీ ఉండదు. మనం ఎక్కడకు వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్పించి ఈ లోకంలో ఏముంది. ఈ రాగద్వేషముల మధ్యన మన మనస్సు తిరుగుతూ ఉంటుంది, ఈలోపు శరీరానికి మరణం వస్తుంది, రాగద్వేషములు

మన కూడా వచ్చేస్తాయి. మనకు విచారణ లేదు, సజ్జనసాంగత్యం లేదు, హృదయం యొక్క లోతులు పెంచుకోవాలి అనే తపన లేదు ఎంతసేపు ఆ గౌరవం సంపాదించాలి, ఈ గౌరవం సంపాదించాలి అనుకొంటాము, ఆ గౌరవాలు ఏమి చేసుకొంటారు. బట్టల మీద దుమ్ము పడ్డట్లుగా మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఏదైనా గౌరవం వచ్చింది అనుకోండి, దాని వలన మీకు నష్టం లేదు. మీరు కోరి తెచ్చుకొన్నది మాత్రం మిమ్మల్ని బంధిస్తుంది, అది పునర్జన్మకు కారణం అవుతుంది.

మాయ అంతా గుణాల రూపంలో ఉంది. ఈ గుణాల నుండి బయటకు రాకుండా ఎవడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఇంట్లో నలుగురు మనుషులు ఉంటే నాలుగు రకాలుగా ఉంటారు, దీనికి గుణాలే కారణం. ఎవరైనా పొగిడితే పొంగిపోవద్దు, తిట్టినా కృంగిపోవద్దు, ఇవన్నీ గుణాలు. మనం ఏదిగా ఉన్నామో అందులో గుణాలు లేవు. ఇది మీకు అర్థమవుతూ ఉంటే మీకు ఎమోషన్ రాదు. సర్వసాధారణంగా మనిషికి తొందరగా అసూయ వస్తుంది. 100కి 90 విమర్శలు అసూయ వలన వస్తాయి. ఇటువంటి గుణాల వలన మనకు అంతర్దృష్టి రాదు. అంతర్ముఖంగా ప్రయాణం చేసిన వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎవడైతే అంతర్ముఖంగా ప్రయాణం చేయలేడో వాడికి ఎంత కష్టపడినా ఆత్మజ్ఞానం కలుగదు, చివరకు శరీరానికి చెమట మిగులుతుంది. మనం ఎంతసేపు బాహ్యా ముఖంగా ప్రయాణిస్తున్నాము, అంతర్ముఖంగా ఎందుకు ప్రయాణం చేయలేకపోతున్నాము, దానికి ఏది అడ్డు వస్తోంది అని మనం జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. గురువు ఏమిచేస్తాడు అంటే మీలో ఉన్న బలహీనతలను మీకు తెలియజేసి, వాటిని తొలగించుకొనే శక్తిని మీకు ఇస్తాడు, వాడు గురువు. గురువు ఎడ్రసు నీకు తెలియదు కాని నీ ఎడ్రసు గురువుకు తెలుసు. ఆయన ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని మీరు పొందేవరకు ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు. గురువు ఒకోసారి మిమ్మల్ని ఒడిలోకి తీసుకొని లాలిస్తాడు, ముద్దుపెట్టుకొంటాడు ఒకోసారి నీకు నాకు సంబంధం ఏమిటి అని గెంటేస్తాడు, ఆయన ఏమి చేసినా అది మనలను అనుగ్రహించటానికే అని గ్రహించినవారు ధన్యులు. అది గుర్తించటానికి మనకు పుణ్యబలం ఉండాలి.

మనం మాట్లాడేమాట, చేతితో చేసేపని, మనకు వచ్చే ఆలోచనలు మనలో ఉన్న

భక్తిని పెంచేలా ఉండాలి. మన డ్యూటీ మనం సక్రమంగా, కూల్‌గా చేయాలి అంతేగాని గొప్పలకోసం పనిచేస్తే చివరకు మనకు తిప్పలు మిగులుతాయి. శాంతచిత్తం వలన, నిర్మలమైన మనస్సు వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. కాలాన్ని పాడు చేసుకోవద్దు. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. నీటితో మన శరీరాన్ని ఎలా శుభ్రం చేసుకొంటున్నామో అలాగ భగవంతుడిని ప్రార్థిస్తూ మనస్సును శుభ్రం చేసుకోవాలి. ఒక్క స్మరణ చాలు. భగవంతుడిని నిరంతరం స్మరించటం వలన మనోనాశనం అవుతుంది. మనం విషయాలను చింతిస్తున్నాము. విషయాలను చింతించటం మానేసి భగవంతుడిని చింతిస్తే మనం పవిత్రులం అవుతాము. మనకు ఏ తలంపు వచ్చినప్పుడు, ఆ తలంపు ఒక్కటే నిజం అనిపిస్తుంది. మనకు కోపం వస్తే అదే నిజం అనిపిస్తుంది. ఒకసారి తుకారామ్ భార్యకు ఆయన మీద కోపం వచ్చి చెరుకుగెడతో తలమీద కొట్టింది, చెరుకుగెడ రెండు ముక్కలు అయ్యింది. ఆ టైములో ఆవిడకు కోపం వచ్చింది అదే నిజం అనిపించింది. తుకారామ్ ఏమన్నాడు అంటే రెండు ముక్కలు చేయాలి అనుకొన్నాను ఆ గొడవ లేకుండా రెండు ముక్కలు అయ్యింది నీకు ఒక ముక్క, నాకు ఒక ముక్క అన్నాడు. మనస్సు లోపలకు ప్రయాణం చేస్తున్నప్పుడు, భగవంతుడివైపుకు ప్రయాణం చేస్తున్నప్పుడు ఉపయోగంలేని తలంపులు ఆగిపోతాయి.

మనం సాధన చేస్తున్నప్పుడు మన సాధనకు, మనలో ఉన్న వాసనలకు పోరాటం జరుగుతుంది. రెండు పొట్టేళ్ళు పోరాడుకొంటున్నాయి అనుకోండి. అందులో బలం తక్కువ ఉన్న పొట్టేలు పోరాడి పోరాడి చివరకు పడిపోతుంది. అలాగే మన సాధనాబలం ఎక్కువగా ఉంటే మనలో ఉన్న వాసనలు ఒక్కొక్కటి రాలిపోతాయి. విషయాలు నిజం అనుకొంటూ మన మనస్సు ఎంత దూరం అయితే ప్రయాణం చేస్తుందో అంతదూరం మరల వెనక్కి వస్తేగాని దాని మూలంలో పడదు. నీ ప్రయత్నం లేకుండా మనస్సు దాని మూలం అయిన హృదయంలో సహజంగా ఉండగలిగితే అదే భక్తియోగం, అదే ధ్యానయోగం. ఎవడైతే మోక్ష ప్రదాతో వాడిపట్ల గౌరవం లేనప్పుడు, వాడిపట్ల ఇష్టం లేనప్పుడు, ఆయన వైభవం గురించి, శక్తి గురించి నీకు తెలియనప్పుడు నీవు ఎన్ని సాధనలు చేసినా అది ఫలించదు. నీవు సాధనలు చేస్తే చేయవచ్చు కాని ఈశ్వరుడి పట్ల సజీవమైన విశ్వాసం లేకపోతే సాధనలు ఫలించవు. ఈశ్వరుడు మనుషులను ఎందుకు కలుపుతున్నాడో, ఎందుకు విడదీస్తున్నాడో

మనకు తెలియదు. మనుషులను కలిపినప్పుడే ఎప్పుడు విడిపోవాలో నిర్ణయించేస్తాడు. ఇది మనకు ప్రాణసంకటం, భగవంతుడికి అది ఒక ఆట. బ్రహ్మానుభవం కలిగే వరకు ఇది ఒక ఆట అని నీకు తెలియదు. అప్పటి వరకు ఇది నిజం కింద నీకు అనిపిస్తుంది, నిజం కింద అనిపిస్తున్నంతకాలం దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. ఆహారనియమం చాలా ముఖ్యం. అతిగా తింటే జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, ఏకాగ్రత తగ్గిపోతుంది. శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం తగ్గిపోతుంది. భగవంతుడు మన లోపల అంతర్యామిగా ఉన్నాడు, మన డ్రైవర్ మనలోనే ఉన్నాడు. ఆయన పట్ల మనకు విశ్వాసం లేకపోవటం వలన, మనకు లోచూపు లేకపోవటం వలన ఆయన మనకు తెలియటం లేదు. ఆయన పట్ల విశ్వాసం కలగటానికి కూడా ఎన్నో జన్మల సుకృతం ఉండాలి. మనం అమృతానుభవం పొందాలంటే శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. రుచి సరిగా లేకపోతే ఎలాగూ ఎక్కువ తినము. రుచి బాగున్నప్పుడే మనం కంట్రోలు చేసుకోవాలి. నాలుక రుచి, మాటలు రెండు పనులు చేస్తుంది. రెండు పనులు చేసే నాలుకను కంట్రోలు చేసుకొంటే మిగిలిన ఇంద్రియాలు కంట్రోలు అయిపోతాయి అన్నారు గాంధీగారు.

ఇతరులు సహకరించటం లేదు అనే గొడవ వద్దు. మనకు మనమే శత్రువులము. ఇతరులు చేసే అపకారం కంటే మన మనస్సే మనకు ఎక్కువ అపకారం చేస్తుంది. మనకు మనం శత్రువులం కాకుండా మనకు మనం మిత్రులుగా మార్చుకొంటే, అంటే మన మనస్సును మనకు మిత్రుడిగా మార్చుకోగలిగితే అది అమృతానుభవం పొందటానికి సహకరిస్తుంది. మన మనస్సు మనకు సహకరించకపోతే, మన ఇంద్రియాలు మనకు సహకరించకపోతే, మన బుద్ధి మనకు సహకరించకపోతే అమృతానుభవం కలుగదు. మనకు లోపల ఎంతో కొంత గర్వం ఉంటుంది. గర్వం ఉండటం వలన భగవంతుడు చెప్పిన మాటలు మనకు అర్థం కాదు. శబ్దానికి అర్థం తెలియవచ్చు కాని భగవంతుడు ఏ హృదయంతో అది చెప్పాడో అది మనం పట్టుకోలేము. మనకు అన్నీ కావాలి, భగవంతుడు కావాలి. భక్తుడికి భగవంతుడు ఒక్కడే కావాలి. భగవంతుడు ఒక్కడే కావాలి అనుకొంటే ఇంక ఏమీ లేదు. నాపట్ల నిజమైన శరణాగతి కలిగితే నీలో ఎన్ని దోషాలు ఉన్నా వాటిలో నుండి విడుదల చేసి నీకు మోక్షాన్ని ప్రసాదించే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. నామీద విశ్వాసం కుదిరినప్పుడు నీకు దుఃఖంతో పని ఏముంది? నారాయణుడు అంటే ఒక వ్యక్తి కాదు, నారాయణ నారాయణ

అంటే నరుడు పొందవలసిన గమ్యం నారాయణుడు. ఈ సృష్టిలో జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి. ఇప్పుడు మనం అనుభవించే సుఖాలు అన్నీ భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతాయి. హృదయంలో భగవంతుడు ఉన్నాడు అంటున్నారు, ఉంటే మనకు తెలియాలి కదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. పెంట మీద కూర్చొని అత్తరు వాసన రావాలి అంటే ఎలాగ, పెంట వాసనే వస్తుంది. ముందు పెంట మీద నుండి బయటకు రా. నీలో ఉన్న దోషాల నుండి బయటకురాకుండా ఈశ్వరుడు దర్శనం అవ్వలేదు అంటావు ఏమిటి? ముందు నీ బుద్ధిలో ఉన్న దోషాల నుండి బయటకు రా, అప్పుడు ఈశ్వరుడు దర్శనం అవ్వకపోతే అప్పుడు అడుగు.

భగవంతుడికి మా మీద దయ లేదు అని చాలామంది తిడుతూ ఉంటారు. మన బుద్ధిలో ఉన్న దోషాలతో ఆయనకు ఏమీ సంబంధం లేదు. మనలో ఏదైతే చెడ్డ ఉందో అది భగవంతుడు మనకు ఇవ్వలేదు. ఆ చెడ్డను మనం మంచి అనుకొని, దానిని నొల్లుకొన్నాము. కొంతకాలం తరువాత ఇది మంచికాదు, ఇది చెడ్డ అని తెలుసుకొన్నాక దానిలో నుండి బయటపడటానికి ప్రయత్నిస్తాము. ఆ చెడ్డ ఏమంటుంది అంటే ఇంతకాలం నాతో ఉన్నావు, అంత తేలికగా నిన్ను వదులుతానా అంటుంది. దానిలోనుండి బయట పడటానికి అనేక జన్మల సాధన ఉండాలి, సాధన చేస్తే సరిపోదు ఈశ్వరానుగ్రహం ఉండాలి అప్పుడు గాని మనలోని వాసన నశించదు. ఒకడికి చిన్న చిన్న దొంగతనాలు చేసే అలవాటు ఉంది. ఒకసారి దొంగతనానికి ఒక డ్రామా వేసే చోటుకు వెళ్ళాడు. ఆ డ్రామాలో సాధువు వేషం వేసేవాడు ఆరోజు రాలేదు. ఆ డ్రామావాళ్ళు వీడిని తీసుకొని వెళ్ళి సాధువు వేషం వేసి స్టేజిమీద కూర్చోబెట్టారు. ఆ డ్రామాలో అందరూ వీడిని పూజిస్తున్నారు. అప్పుడు వాడు అనుకొన్నాడు దొంగసాధవునే ఇంత పూజిస్తున్నారు, నిజంగా సాధువు అయితే ఇంక ఎన్ని పూజలు చేస్తారో అనుకొని దొంగతనాలు మానివేసి సాధువులలో కలిసిపోయాడట. ఆ వేషం వాడిలో మార్పు తీసుకొని వచ్చింది, వాడి బుద్ధి మారిపోయింది, జన్మాంతరంలో చేసింది ఏదో వాడికి కలిసివచ్చింది. చేసింది ఊరికేపోదు, మీరు చేసింది మీకే వచ్చేస్తుంది అని పరమాత్మ చెప్పాడు. నేను తెలివైనవాడిని అని జీవుడు అనుకొంటున్నాడు. వాడు చావటానికి, పుట్టటానికి ఇలా అనేక శరీరాలు మోయటానికి అలవాటు పడ్డాడు, తిరగటానికి అలవాటు పడ్డాడు. వీడిని ఎవడు రక్షిస్తాడు. ఓ అరుణాచలేశ్వరుడా! నీ వైభవం, నీ శక్తి ఆ జీవుడికి చూపిస్తే

వాడు లొంగిపోతాడు, ఈ జీవుడి పీడ నాకు వదిలిపోతుంది అంటున్నారు. నా ప్రయత్నం వలన మనస్సు అణుగుతుంది అనే నమ్మకం పోయింది, నీ శక్తిని చూపిస్తే మనస్సు అణిగిపోతుంది అంటున్నారు. చావు, పుట్టుక, ముసలితనం, రోగాల వలన వచ్చే బాధలు ఇవి అన్నీ నీ మనస్సులో అప్పుడప్పుడు చూసుకొంటూ ఉంటే మనస్సుకు వైరాగ్యం వస్తుంది అని చెపుతున్నారు. పిల్లలు పుట్టకుండా నేను ఆపరేషన్ చేయించుకొన్నాను అని ఒకడు భగవాన్‌తో చెపితే భగవాన్ ఏమన్నారు అంటే నీవు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో అన్నారు. అంటే ఆత్మజ్ఞానం కలిగేవరకూ ఈ చావుపుట్టుకలు ఆగవు. ఎక్కడో ఒకచోట పుడుతూనే ఉంటావు, మరణిస్తూనే ఉంటావు. మానవజాతి అంతా ఏ గమ్యాన్ని చేరటానికి ప్రయత్నం చేస్తోందో, సాధనలు చేస్తున్నారో ఆ గమ్యాన్ని అరుణాచలా అంటేనే నీవు నాకు ప్రసాదించావు. నీ శక్తి ఇట్టిది, నీ వైభవం ఇట్టిది అని ఎలా చెప్పగలను, దానిని నోటితో చెప్పలేను, దాని గురించి ఎలా వ్రాయగలను.

మీరు ఏదైనా సాధిస్తే అది మీ తెలివితేటల వలన సాధించాను అనుకొంటారు. అది భగవంతుడి ప్రసాదం అని మీకు తెలియటం లేదు. మనం భగవంతుడికంటే వేరుగా ఉన్నాము అనుకోవటం వలన నేను ఏదో సాధించాను అని అనిపిస్తోంది. దానివలన దేహాభిమానం పెరిగిపోతుంది. వేరుభావనలో నుండే తంటా అంతా వస్తోంది, వేరుభావనలో నుండే బంధింపబడతాము. ఈ శరీరం విడిచి వెళ్ళేటప్పుడు గుండుసూది కూడా పట్టుకొని వెళ్ళలేము. ఈ ప్రపంచాన్ని చూసి రాగద్వేషములు పెంచుకొంటున్నాము. ఈ శరీరం మన కూడా రాదు కాని రాగద్వేషాలు మరణానంతరం మన కూడా వచ్చేస్తాయి. మనం ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గుడులు కట్టించినా, మనకు ఎంత ధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా లోపల కపటం ఉంటే ఆత్మజ్ఞానం కలుగదు. భక్తి అనేది పులి లాంటిది. పులి దగ్గరకు మేకలు ఎలా వెళ్ళవో అలాగే భక్తి ఉన్న చోటుకు విషయాలు వెళ్ళవు. మీరు అన్నవరం వెళ్ళండి మీలో ఉన్న వాసనలు పోతాయి అంటే లేడిలాగ పరుగుపెట్టుకొని వెళ్ళిపోతారు. ఒక విషయం గురించి ఆలోచించండి అంటే ఎవరూ ఆలోచించరు. ఎందుచేతనంటే మనం సోమరితనానికి అలవాటుపడ్డాము. నేను తెల్లగా ఉన్నాను, నేను నల్లగా ఉన్నాను, నేను పేదవాడిని, నేను ధనవంతుడిని, నేను తెలివైనవాడిని, నేను తెలివి తక్కువవాడిని, ఇలా అనుకోవటాలు మానివెయ్యి. ఇందులో ఏదీ నువ్వు కాదు. ఈ రోజు బీదవారుగా

ఉన్నవారు రేపు ధనవంతులు అవ్వవచ్చు, ఈ రోజు ధనవంతులు రేపు బీదవారు అవ్వవచ్చు, ఇవన్నీ నిజం కాదు. నీవు దేనితోనూ తాదాత్మ్యం పొందవద్దు. నేను మంచి వాడిని, నేను చెడ్డవాడిని అని అనుకోవద్దు. అనుకోవటాలు అన్నీ వదిలేసి ఊరక ఉండు. అప్పుడు జ్ఞానం లోపల నుండి ఊరుతుంది. హెచ్చుతగ్గుల గురించి చెప్పేవాడు జీవుడు. నువ్వు ఎంత, నీ జీవితం ఎంత. ఏదో ఒక శక్తి ఇది అంతా నడిపిస్తోంది, అది మన కళ్ళకు కనబడదు. ఈ రోజు మనం ఇలా ఉన్నాము అంటే ఆయన అనుగ్రహం వలన ఇలా ఉన్నాము అన్న సంగతి మరిచిపోతున్నాము. మనం మంచి చేస్తే మంచి, చెడ్డ చేస్తే చెడ్డ మనకు తిరిగివస్తుంది. అవి మీకు కనబడుతున్నాయా, లేదు. దేవుడు మాట అటు ఉంచండి, ధర్మం యొక్క ప్రభావం కూడా మీ కళ్ళకు కనబడదు. అలాగని ధర్మం లేదు, మోక్షం లేదు అని అనుకోవద్దు. ఇంక మీ డబ్బు, మీ కోరికలు మీకు కనిపిస్తున్నాయి. డబ్బు ఉండటం వలన నష్టం ఏమీ లేదు, డబ్బుతో తాదాత్మ్యం వలన పాడైపోతాము. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవడి జీవితం ఒకేలాగ ఉండదు, వాడికి ప్రారబ్ధం ఉంటుంది, ప్రారబ్ధం ప్రకారం నడుస్తుంది, డబ్బులేని వాడు ఏడుస్తున్నాడు, వెయ్యి కోట్ల డబ్బు ఉన్నవాడు ఏడుస్తున్నాడు, వారి భయం వారికి ఉంటుంది. రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకోకండి. నేను మంచి వాడిని, నేను చెడ్డ వాడిని, నేను ఎక్కువ వాడిని, నేను తక్కువ వాడిని అని అనుకోవద్దు. ఏదీ అనుకోకుండా ఉంటే మీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. ఈ చిన్న విషయం అర్థం కాక అంతా బాడి చేసేసుకొంటున్నారు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది దానిని నీ బుద్ధి ఎంతకాలం అయితే గ్రహించలేదో అంతకాలం ఈ చావుపుట్టుకలు తప్పవు, ఈ ప్రయాణాలు తప్పవు. ఈ జననమరణ చక్రంలో తిరుగుతూనే ఉంటావు, దీనిని ఎవరూ ఆపలేరు. మనం ఎక్కువ కాలం బతకాలి అని అనుకోకూడదు, తొందరగా చనిపోవాలి అనుకోకూడదు. భగవంతుడు ఎక్కడ నిలబడితే అక్కడ, ఎలా నిలబడితే అలాగ నిలబడాలి, ఆయన నిర్ణయాన్ని గౌరవించాలి. ఎక్కువ కాలం బతకాలి అనుకోవటం వలన, చనిపోవాలి, చనిపోవాలి అనుకోవటం వలన భగవంతుడిని అగౌరవపరచినట్లు అవుతుంది. ఆయన సంకల్పంలో ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయన సంకల్పాన్ని బట్టి ఈ సృష్టి అంతా నడుస్తోంది. ఇది తెలుసుకోవటం కావాలి. నీకు తెలుసున్నా, నీకు తెలియకపోయినా

ఈశ్వరుడి సంకల్పమే జరుగుతుంది. ఇది తెలుసుంటే సుఖపడతావు, తెలియకపోతే దుఃఖం నిన్ను వెంటాడుతుంది. హరినామం సర్వరోగ నివారిణి. మీకు ఏదైనా రోగం వస్తే బయట నుండి మందులు వాడుతూ, లోపల నామం చేయండి. అది లోపల నుండి పనిచేసి రోగం తొందరగా తగ్గిపోతుంది. నేను అందంగా ఉన్నాను, నేను అందంగా లేను, నేను మంచి వాడిని, నేను చెడ్డవాడిని అని ఇలా అనుకోవద్దు. ఇలా అనుకోవటం వలన నీ హృదయంలో ఉన్న నిజానికి దూరమయిపోతున్నావు, నీవు భ్రష్టుడవు అయిపోతున్నావు. అనుకోవటాలు మానివేస్తే నీ హృదయంలో ఉన్న నిజంతో తాదాత్మ్యం ఏర్పడుతుంది, దాని తాలుక ఎరుక నీకు కలుగుతుంది, అదే నీవు అవుతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-01-2007, మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన కళ్ళకు కనిపిస్తున్న ఈ సృష్టి అంతా మాయ. ఇది అంతా మూడు గుణాలతో నిండి ఉంది. సత్వగుణం, రజోగుణం, తమోగుణం. ఈ ప్రకృతిలో భాగమైన జీవకోటి అంతా ఈ మూడు గుణాలతో కలిసి ఉంటుంది. ప్రకృతిని దాటటం అంటే ఈ మూడు గుణాలను దాటాలి. ఈ మూడు గుణాలను ఎవడైతే అతిక్రమించాడో వాడు పరమాత్మ స్వరూపాన్ని పొందుతాడు. కర్మయోగం, జ్ఞానయోగం. ప్రపంచం అంతా నాదే అనుకొని పని చేసేవాడు కర్మయోగి, ప్రపంచంలో ఏదీ నాది కాదు అనుకొని పనిచేసేవాడు జ్ఞానయోగి. నువ్వు ఇలా పని చేసినా, అలా పని చేసినా పరమాత్మనే పొందుతావు అని వేదం చెపుతోంది. అయితే ఈ మూడు గుణాలను దాటటం చాలా కష్టం. ఈ మూడు గుణాలను దాటకపోతే నీవు ప్రకృతిని దాటలేవు. ప్రకృతిని దాటలేని మనుషులను తీసుకొని వచ్చి మరల భగవంతుడు ఈ సృష్టిలోనే కలిపేస్తాడు, ఈ జననమరణ చక్రంలో నుండి బయటకు తీయడు అని బాబా చెప్పారు. ఈ మూడు గుణాలను దాటిన వారిని మాత్రం మరల ఈ సృష్టిలో కలపడు. అయితే మన శరీరం చనిపోయేటప్పుడు సత్వగుణంలో ఉంటే మంచి జన్మలు వస్తాయి, మూడు గుణాలు దాటిన వాడికి జ్ఞానం కలుగుతుంది, వాడికి ఇంక పునర్జన్మ లేదు. తమో గుణంలో ఉండగా శరీరం చనిపోతే బాగా చీకటిలోకాలకు పోతాము. మనం అందరం మాయ చేతిలో ఉన్నాము, మాయ భగవంతుడి చేతిలో ఉంది. అందుచేత భగవంతుడి

పాదాలను ఆశ్రయిస్తే మనం ఈ మాయలో నుండి బయటకు రాగలం గాని మన సాధన వలన, మన తెలివి వలన మాయలో నుండి బయటకు రాలేము. భగవంతుడి యొక్క దయను ఏ జీవుడు అయితే పొందాడో వాడికి మాయ దారి ఇస్తుంది. ఈ సృష్టి అంతా గుణాలతో నిండి ఉంది. సృష్టిలో ఎక్కడికి వెళ్ళి చూసినా గుణాలే. ఈ గుణాలను దాటిన వాడిలో జ్ఞానం యొక్క వైభవం మనకు కనబడుతుంది. ఈ మూడు గుణాల నుండి బయటపడటానికి యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించమని భగవంతుడు చెప్పాడు. మనలో ఉన్న రోగం, దానికి మందు కూడా భగవంతుడు చెప్పాడు. పరమాత్మను పొందటానికి నీవు ఏ ప్రయత్నం చేసినా అది యజ్ఞంతో సమానము. మనం చేసే పని మంచిది అయినా అది గౌరవంగా చేయాలి, ప్రీతిగా చెయ్యాలి, మర్యాదగా చెయ్యాలి, అప్పుడు అది భగవంతుడి దృష్టిలో సత్కర్మ అవుతుంది. నీవు చేసేది మంచి పని అయినా అమర్యాదగా చేస్తే, అగౌరవంగా చేస్తే అది భగవంతుడి దృష్టిలో చెడ్డకర్మ అవుతుంది అంటే డబ్బూ పోతుంది, శని పట్టినట్లు అవుతుంది. బాబాగారికి భోజనం పెట్టటం అంటే ఇష్టం. మనిషి డబ్బు లేకుండా ఉండ గలడు, చదువు లేకుండా ఉండగలడు, గౌరవం లేకుండా ఉండగలడు గాని తిండి లేకుండా మనిషి బతకలేడు. ఆకలి కూడా ఒక జబ్బు లాంటిది. నువ్వు రోగానికి మందు ఎలా వాడతావో అలాగే ఆకలి అనే రోగానికి సరిపడ అన్నం తిను. ఆయన బిక్ష చేసుకొని తెచ్చిన అన్నం మనుషులకు, జంతువులకు కూడా పెట్టేవారు బాబా.

మామిడిపండు బాగా తయారయ్యింది అనుకోండి, దానిని కాకులు పొడిచాయి అనుకోండి, కాకులు పొడిచిన మామిడిపండును మనం భగవంతుడికి నైవేద్యంగా పెట్టము, మనం తినము, ఇతరులకు కూడా ఇవ్వము, ఆ పండు అలా పాడైపోతుంది. మన హృదయంలో భోగవాంఛలు ప్రవేశిస్తే కాకులు పొడిచిన మామిడిపండుకు ఏ గతి పట్టిందో మనకు కూడా అదే గతి పడుతుంది, అంటే ఎందుకు పనికిరాకుండా పోతాము అని రామకృష్ణుడు చెప్పారు. కొంతమంది ఎంత సేపు మనం ఏ బట్టలు కట్టుకొన్నాము, ఏమి తింటున్నాము, ఏమి అధికారం సంపాదించాము అని లెక్కలు వేసుకొంటూ ఉంటారు. రామకృష్ణుడు ఏమని చెప్పారు అంటే మీకు ఏమైనా గొప్పలు, గౌరవాలు ఉంటే వాటిని అంటిపెట్టుకొని ఉండవద్దు పామును చూసినప్పుడు మీ శరీరం ఎలా పారిపోతుందో అలాగ ఈ గొప్పలు, గౌరవాలలో నుండి మీ మనస్సు పారిపోతే మీకు జ్ఞానం వస్తుంది కాని వాటిని

అంటిపెట్టుకొని ఉంటే కోటి జన్మలు ఎత్తినా మీకు జ్ఞానం రాదు అని చెప్పాడు. మీకు దేవుడు అక్కర లేదు, గొప్పలు గౌరవాలు కావాలి ఇంక మీకు జ్ఞానం ఎలా కలుగుతుంది. గౌరవం ఉన్నవాడు ఇంకా గౌరవం పెంచుకోవాలి అని చూస్తాడు, అధికారం ఉన్నవాడు ఇంకా అధికారం పెంచుకోవాలి అని చూస్తాడు, ఇంక వాడికి దేవుడి గొడవ ఉండదు. వాడు ప్రకృతిలో కలిసిపోతాడు, మట్టిలో కలిసిపోతాడు, కాకులు పొడిచిన మామిడి పండులాగ వాడు ఎందుకు పనికిరాకుండా అయిపోతాడు. కొంతమందికి పశువులు అంటే చాలా ఇష్టం. ఇంట్లో తినే వస్తువులను కూడా పశువులకు పెడతారు. చనిపోయిన వాడి గతి గురించి శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే వాడు ఎంత ప్రేమగా పశువులకు మేత పెట్టినా వాడు చనిపోయినప్పడు పశువులు కూడా రావు, పాకలోనే ఉంటాయి, వాడు సంపాదించిన డబ్బు బ్యాంక్‌లో ఉంటుంది, లేకపోతే ఇంటిలో ఉంటుంది. పెళ్ళాం ఇంటిలో ఉండి ఏడుస్తుంది, గుమ్మందాటి బయటకు రాదు. బంధువులు, స్నేహితులు స్మశానం వరకు వస్తారు. ఇంక మరణానంతరం వాడి కూడా వచ్చేది ఏమిటి అంటే వాడు బతికి ఉండగా చేసిన ధర్మం, వాడు సంపాదించిన జ్ఞానం తప్పించి ఇంక ఏదీ మరణానంతరం వాడి కూడా రాదు అని శాస్త్రంలో చెప్పారు. మరణానంతరం మనకూడా వచ్చే ధర్మాన్ని మనం ఆచరించటం లేదు, జ్ఞానాన్ని సంపాదించటం లేదు. జీవుడి కూడా వచ్చే వాటిని మనం పూర్తిగా వదిలేసాము, ఇదే అజ్ఞానం అని శాస్త్రంలో చెప్పాడు.

అందరికంటే చెడ్డవాడు ఎవడు అని ఈమధ్య అమెరికాలో ఒక న్యూస్ పేపరులో వ్రాసారు. ఇతరులలో ఉన్న చెడ్డను ఎవడైతే వెతుకుచున్నాడో వాడు ప్రపంచంలో అందరికంటే చెడ్డవాడు, వాడే దుర్మార్గుడు అని వ్రాసారు. మనం ఏ శరీరంలో ఉంటే ఆ శరీరం ఒక్కటే నిజం అనుకొంటాము. భగవంతుడు ఎప్పడైనా శరీరం తీసుకొన్నా ఆ శరీరమాత్రుడను కాదు అన్న సంగతి ఆయనకు తెలుస్తూ ఉంటుంది, వాడు దేవుడు. ఈ దేహమే నేను అనే బుద్ధి ఎవడికైతే నశించిందో వాడు దేవుని స్వరూపాన్ని పొందుతాడు. ఎవడైతే తనను తాను పోగొట్టుకొంటాడో వాడు అందరివాడు అవుతాడు. ఎవడైతే తనను తాను పోగొట్టుకోడో వాడికి పదివేల కోట్ల డబ్బు ఉన్నా వాడు అందరి వాడు అవ్వలేడు, వాడిని ఎవరూ గౌరవించరు, పూజించరు. ఎవడైనా అప్పకోసం వెళ్ళినవాడు వాడిని పొగుడుతూ ఉంటాడు, వాడి దగ్గర నుండి అప్ప చేయటం కోసం ఏదో పొగుడుతాడు, అవన్నీ నిజం అని వీడు అనుకొంటాడు.

ఇటువంటి పిచ్చి గొడవలలో నుండి పారిపొమని రామకృష్ణుడు చెపుతున్నాడు. మీకు ఎక్కడైనా పాము కనిపిస్తే పారిపొమ్మని గురువు చెప్పాలా, మీ అంతట మీరే పారిపోతారు. అలాగే ఇటువంటి గొడవలలో నుండి పారిపొమ్మని రామకృష్ణుడు చెపుతున్నాడు. అంతా నారాయణ స్వరూపమే. పాము రూపంలో మిమ్మల్ని కరిచిన వాడిని నేనే, డాక్టరు రూపంలో మిమ్మల్ని బ్రతికించిన వాడిని నేనే, మీకు డబ్బు ఇచ్చిన వాడిని నేనే. మీ దగ్గర నుండి డబ్బు పట్టుకొనిపోయేవాడిని నేనే. మిమ్మల్ని సన్మానించిన వాడిని నేనే. మిమ్మల్ని దూషించిన వాడిని నేనే. అంతా నారాయణ స్వరూపమే, ఇది మీకు అర్థమైతే మనస్సు చల్లబడుతుంది అని గీతలో పరమాత్మ చెప్పాడు. మీకు ప్రాణం పోసినవాడు నారాయణుడు, మీ ప్రాణం తీసేవాడు నారాయణుడు, అంతా నారాయణ స్వరూపమే, ఆయనకు భిన్నంగా ఏదీ లేదు అని ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడికి జ్ఞానం కలుగుతుంది.

వివేకానంద తండ్రిగారు కలకత్తాలో ప్లీడరుగా పనిచేసేవారు. ఆయన ఇంకో సంవత్సరంలో చనిపోతారు అనగా మేము నేర్చుకొనే విషయం ఏదైనా ఉంటే చెప్పండి అని వివేకానంద తండ్రిగారిని అడిగాడు. ఆయన ఏమి చెప్పారు అంటే ప్రపంచంలో ఏది ఎప్పుడు ఎక్కడ జరిగినా ఆశ్చర్యపడకు, ఏమిటి ఇలా జరిగింది అని నీ మైండ్ అప్‌సెట్ అవ్వకూడదు, ఏమీ కోపం తెచ్చుకోవద్దు. ఈ కేసు తప్పకుండా నెగ్గుతాము అనుకొన్నది ఒకోసారి ఓడిపోతాము. ఓడిపోతాము అనుకొన్నది ఒకోసారి నెగ్గుతాము, అందుచేత ఏ విషయంలోను ఆశ్చర్యం వ్యక్తపరచవద్దు. ఏ సంఘటన అయినా సరే ఇలా జరిగిపోయింది ఏమిటి అలా జరిగిపోయింది ఏమిటి అని ఆశ్చర్యపడవద్దు, నారాయణుడికి తెలియకుండా ఏదీ జరగటం లేదు. ఇదే నీకు చెప్పే ఉపదేశం అన్నాడు. వివేకానందుడు రామకృష్ణుడి దగ్గరకు వచ్చేటప్పటికి పోట్లగిత్తకింద ఉండేవాడు. అటువంటివాడిలో ఉన్న రజోగుణం తగ్గించి, వాడిని సత్వగుణంలోనికి తీసుకొని వచ్చి, సహనాన్ని నేర్చుకోమని చెప్పి ఆయన చివరి రోజున ఏమన్నాడు అంటే నేను సంపాదించిన తపోశక్తిని అంతా నీకు ధారపోసి నేను బిచ్చగాడి కింద అయిపోయాను అన్నాడు రామకృష్ణుడు. ఇదంతా ఎందుకు ధారపోసాను అంటే భవిష్యత్‌లో నీవు పది మందికి ఉపకారం చేస్తావు, ప్రపంచానికి మంచి చేస్తావు, ప్రపంచానికి బోధిస్తావు కాబట్టి నాకున్న శక్తినంతా నీకు ధారపోసాను అన్నాడు రామకృష్ణుడు. రోజూ పేకాట ఆడే వాడికి మీరు వెయ్యి రూపాయలు ఇచ్చి నేను దానం చేసాను అనుకొంటే అది

అపాత్రదానం, అది పేకాటను పెంచేస్తుంది. అపాత్రదానం వలన మీకు మంచిరాదు, చెడ్డవస్తుంది, పుణ్యం రాదు పాపం వస్తుంది. అంటే డబ్బూ పోతుంది, శనిపట్టినట్లు అవుతుంది. అందువలన అపాత్రదానం పనికిరాదు.

ఉన్నది చైతన్యం ఒక్కటే. మహాసముద్రంలో నుండి కెరటాలు ఎలా వస్తున్నాయో, బుడగలు ఎలా వస్తున్నాయో, నురుగు ఎలా వస్తోందో అలాగే చైతన్యంలో నుండి సమస్త జీవకోటి వస్తోంది, చైతన్యంలో నుండి అవతార పురుషులు వస్తున్నారు, గురువులు వస్తున్నారు. నీరు లేకుండా కెరటాలు లేవు, బుడగలు లేవు. అలాగే చైతన్యం లేకపోతే ఈ జీవకోటి లేదు. అటువంటి చైతన్యం అంతటా ఉంది, నీ హృదయంలో కూడా ఉంది. అందులో సందేహం లేదు. కాని చైతన్యం మీ శరీరంలో ఒక భాగంకాదు. మీ శరీరంలో ఒక భాగం అయితే స్మశానంలో మీ శరీరాన్ని కాల్చినప్పుడు అది కూడా కాలిపోతుంది, మీ శరీరంలో ఒక భాగం కాదు కాబట్టి అది లేదు అని అనుకోవద్దు. మీరు జపం చేయగా చేయగా మీకు ధ్యానస్థితి కలుగుతుంది, ధ్యానస్థితి కలిగాక మీకు సమాధిస్థితి కలుగుతుంది. సమాధిస్థితిలో ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరిస్తుంది. మనోనాశనం అయినవాడికి చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు, మాట్లాడటానికి ఏమీలేదు. అంతేకాదు ఇంతకు ముందు చూసిన విషయాలు, విన్న విషయాలు రోత పుడతాయి. ఇవన్నీ మనకు అబద్దాల కింద అనిపిస్తుంది ఎందుచేతనంటే మనకు అనుభవం లేదు. వస్తువు మన హృదయంలోనే ఉంది కాని అది మన ఇంద్రియాలకు కనబడదు, మన బుద్ధికి గోచరించదు. అందుచేత అది ఉన్నా కాని లేదు అని మనం అనుకొంటున్నాము.

మీరు జపం చేసేటప్పుడు ఆ నామం ఊరికే అక్షరాలు అనుకోవద్దు, ఆ నామం భగవంతుడే అనుకొని చేయండి, అప్పుడు భగవదనుగ్రహానికి పాత్రులవుతావు. తులసీదాసు ఏమని చెప్పాడు అంటే సీతమ్మ మీద, రాముడి మీద గౌరవం లేనివారు, భక్తి లేనివారు వారు మీకు బంధువులు అయినా, స్నేహితులు అయినా వారిని పూర్తిగా వదిలివేయండి అని చెప్పాడు. అవసరమైతే బంధుత్వాలు, స్నేహాలు వదులుకోండి అంతేకాని సీతారాములను విడిచిపెట్టవద్దు అని చెప్పారు. వారు భక్తిని ఎంతదూరం తీసుకొని వెళ్ళారో చూడండి, అంటే మనం పవిత్రులం అవ్వటం, మనం బాగుపడటం వారికి ముఖ్యం. వారికి కపటం,

లౌకికత్వం తెలియదు. అలా భగవంతుడికోసం బంధువులను వదిలేసిన స్త్రీ మీరాభాయి. అది చాలా కష్టం, మనం నోటితో చెప్పకొన్నంత తేలిక కాదు. ప్రతీ మనిషికి కోరిక, కోపం ఈ రెండు దోషాలు ఉంటాయి. ఈ దోషాల వలన ఇంకో వంద దోషాలు రావచ్చు. ఈ రెండు దోషాలు పోవటానికి ఒక్క రామనామం చాలు అని తులసీదాసు చెప్పాడు. ఎక్కడైతే రాముడు ఉన్నాడో అక్కడ కోరిక లేదు, కోపం లేదు. భగవంతుడు రూపం లేకుండా ఉండగలడు, అవసరమైతే రూపం ధరించి వస్తాడు. అలాగే కాళీమాత రామకృష్ణుడి కోసం శరీరం ధరించి వచ్చేది. మీకు ధ్యానబలం ఉంటే నేను మీతో ఎలా మాట్లాడుతున్నానో అలాగ దేవుడితో మాట్లాడవచ్చు. మీరు నామం చేసేటప్పడు నామం వేరు, దేవుడు వేరు అనుకోవద్దు. మీరు చేస్తున్న నామం దేవుడితో సమానము. మీరు చేస్తున్న నామం దేవుడే అనుకొని చేస్తే మీరు కోరుకొన్న ఫలితం వస్తుంది. అది భౌతికం అవ్వవచ్చు, ఆధ్యాత్మికం అవ్వవచ్చు. మీరు జపం చేసినా, ధ్యానం చేసినా ఏది చేసినా గురువు పాదాలయందు భక్తి లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. గురువు అంటే కనిపిస్తున్న దేవుడు. మీరు గురుపాదాలను ఆశ్రయిస్తే మిమ్మల్ని ఆత్మజ్ఞానంతో అనుగ్రహిస్తాడు, వాడు గురువు. గురువు అంటే శరీరం కాదు, గురువు అంటే ఆత్మ. గురువుపట్ల నాకు ప్రేమ కలగాలి, ప్రేమ కలగాలి అంటే కలగదు. గురువు పట్ల ప్రేమను మనకు ఆయనే కలుగజేయాలి. ఆయన ఒడిలో కూర్చోవాలి అంటే కుదరదు. ఆయన ఒడిలోనికి ఆయనే మనలను తీసుకోవాలి. ఆయన అనుగ్రహం లేకుండా, ఆయన యొక్క దయ లేకుండా ఆయన ఒడిలో మనం కూర్చోలేము, ఆయన పాదాలను మనం చేరలేము. మనం ఎంత, మనకు ఉన్న తెలివితేటలు ఎంత?

సూర్యుడు కాంతి దాత, గురువు శాంతి దాత. శరీరం పనిచేయటానికి వెలుతురు ఎంత అవసరమో, మనస్సుకు శాంతి కూడా అంతే అవసరం. మనం నేను, నేను అంటాము, అది మూలతలంపు. నీ చేత విచారణ చేయించి మూలతలంపు మూలం లోనికి తీసుకొని వెళ్ళేవాడు గురువు. మీరు చేస్తున్నాం, చేస్తున్నాం అనుకొంటారు. మీచేత చేయించేది గురువు. ఇదంతా గురువు యొక్క అనుగ్రహమే. లాభనష్టాలు, జీవితంలో వచ్చే హెచ్చుతగ్గులు, గౌరవాలు అగౌరవాలు ఇవి అన్నీ ఈ శవానికే, ఈ శవం నేను అని వేలాడే దొంగ నేనుకే ఇవి అన్నీ కాని లోపల ఉన్న పరమాత్మకు వీటితో సంబంధం లేదు. ఏ వస్తువుకైతే లాభనష్టాలు లేవో, హెచ్చుతగ్గులు లేవో అది మీరై ఉన్నారు. అది మీరై ఉన్నారన్న సంగతి మీకు తెలియక

పోవటం వలన అదృష్టం వస్తే ఒకలాగ, దురదృష్టం వస్తే ఒకలాగ, లాభం వస్తే ఒకలాగ, నష్టం వస్తే ఒకలాగ ఊగిసలాడుతూ మాయ అనే అగ్నిలో కాలి బూడిద అయిపోతున్నారు. గురువు అనుగ్రహం లేకుండా ఈ మాయ అనే అగ్నిలో నుండి మీరు బయటకు రాలేరు. ఇప్పుడు మీకు డబ్బు ఉంది అనుకోండి, నాకు డబ్బు ఉంది, నాకు డబ్బు ఉంది, డబ్బును బట్టి నాకు గౌరవం వచ్చేసింది అని నీవు అనుకొంటూ ఉంటే పామును చూసి నీవు ఎలా పారిపోతావో అలాగ ఈ తలంపులో నుండి ముందు పారిపో అన్నాడు రామకృష్ణుడు. అటువంటి తలంపులు వస్తూ ఉంటే పామును చూసి పారిపోయినట్లు వాటిలో నుండి బయటకు పారిపో, లేకపోతే అవి నిన్ను పిప్పి చేసేస్తాయి, శరీరం చనిపోయాక నీకు చీకటిలోకాలు మిగులుతాయి. ఈ శరీరం శవం అవ్వకముందే నీ హృదయంలో ఉన్న నిజాన్ని నువ్వు తెలుసుకోగలుగుతావు అనుకో ఎంత అపూర్వంగా ఉంటుంది, ఎంత అద్భుతంగా ఉంటుంది, ఎంత ఉదాత్తంగా ఉంటుంది. మిమ్మల్ని మీరు పొందటంకంటే, మీరు మీరుగా అవ్వటంకంటే మీకు మటుకు కావలసింది ఏముంది. అదే ఆనందం, అదే శాంతి. అక్కడ ద్వైతం ఎక్కడ ఉంది. ఆ నిజంలో చావు లేదు, పుట్టుక లేదు, గౌరవం లేదు, అగౌరవం లేదు. అటువంటి ద్వయీభావ రహితమైనటువంటి ఆ పరబ్రహ్మం కనుక నీకు స్వరూపంగా వ్యక్తమైతే ఎంత వండర్‌ఫుల్‌గా ఉంటుంది, ఎంత బ్యూటీఫుల్‌గా ఉంటుంది. నీ ముక్కులో గాలి ఎంత సహజంగా తిరుగుతోందో, నీ జపం కూడా అంత సహజంగా జరుగుతూ ఉంటే నీకు నార్మల్‌గానే జ్ఞానం వచ్చేస్తుంది. మీ హృదయంలో సత్యం ఉంది అని మీకు తెలిసినా, తెలియకపోయినా జపసాధన వలన అది మీకు ఎరుకలోనికి వచ్చేస్తుంది, జపం వలన అంత ఫలితం ఉంది. అందుచేత మీరు ఇంట్లో ఏదో పని ఉందని, పని వంపు పెట్టుకొని జపం చెడగొట్టుకోవద్దు. మామూలుగా మీ చేతులతో పని చేసుకోండి, కాళ్ళుతోటి నడవండి, మనస్సుతో జపం చేసుకోండి.

కాలువగట్లు వంకరగా ఉన్నా ఏటి గట్లు వంకరగా ఉన్నా నీరు వంకరగా లేదు. అలాగే నీ మనస్సులో వంకరలు ఉన్నా, నీ బుద్ధిలో వంకరలు ఉన్నా హృదయంలో ఉన్న నిజం వంకరగా లేదు. అన్ని నదులు సముద్రంలో ఎలా కలుస్తాయో, అలాగే మీ జపం, మీ ధ్యానం, మీ విచారణ అన్నీ మీ హృదయంలో ఉన్న సత్యంలోనికి మిమ్మల్ని చేరుస్తాయి. ఏటిగట్లు వంకరగా ఉన్నాయని నీటి ప్రవాహం ఆగదు, ప్రవాహమే ప్రవాహం, సముద్రంలో కలిసే వరకు

దాని వేగం ఆగదు. ఆ ప్రవాహం ఎలా సాగుతోందో అలాగ మీరు జపం చేసి మీ హృదయంలో ఉన్న ఆనందసముద్రంలో ఐక్యం కండి. నది వెళ్లి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ నీ జపం యొక్క వేగంలో జపించే జపి వెళ్లి హృదయసాగరంలో, శాంతిసాగరంలో ఐక్యమవుతాడు, అది జపం యొక్క ఫలితం. కొంతమందికి 24 గంటలు లోక వ్యవహారములే. నారాయణ అనమంటే నార అంటారు. అటువంటి వారిని కూడా లోక వ్యవహారములనుండి, కుయుక్తల నుండి, కుతంత్రాల నుండి జపం దూరం చేసి ఆత్మ ఒడిలోనికి తీసుకొని వస్తుంది, జపానికి అంత శక్తి ఉంది. పాముని చూసి ఎలా పారిపోతారో అలాగ ఈ లోక వ్యవహారముల నుండి, కుయుక్తులు కుతంత్రాలు ఉన్న మనుషుల నుండి దూరంగా పారిపోండి. మీరు సందేహాలు పెట్టుకోవద్దు. కంటిలో ఉన్న నలుసు ఎటువంటిదో, కాలిలో ఉన్న ముల్లు ఎటువంటిదో సందేహాలు కూడా అటువంటివే. ఉన్న వస్తువు ఏదో ఉంది, అది లేదు, అది లేదు అనుకొంటున్నారు. అది ఉందా లేదా అనే విషయంలో అనుమానాలు వద్దు. భగవంతుడు చెప్పినట్లుగా సాధన చేస్తే దానిని మీరు పొందుతారు. సంశయరహితంగా ఉండండి. మీ హృదయంలో ఉన్న సద్వస్తువు ఎంత నార్మల్‌గా, నేచురల్‌గా ఉందో అంత నార్మల్‌గా, నేచురల్‌గా మీ సాధన జరుగుతూ ఉంటే ఆ వస్తువులో మీరు ఐక్యమవుతారు. ఈ ప్రకృతిలో నుండి, జనన మరణ చక్రంలో నుండి మిమ్మల్ని విడుదల చేస్తాడు, భగవంతుడు కొత్తగా సృష్టి చేసినప్పడు మిమ్మల్ని ఈ సృష్టిలోనికి తీసుకొని రాడు. సంసారం అంటే మీ ఇంట్లో ఉన్న మనుషులు సంసారం కాదు. మీకు ఉన్న కోరికలు, మీ ఇష్టాలు, మీ అయిష్టాలు, మీ కోపతాపాలు సంసారం. మీ మనస్సులో ఉన్న అడివే సంసారం అని భగవంతుడు చెపుతున్నాడు. ఇవి అన్నీ మీ నుండి ఏదో ఆశించి చెప్పేమాటలు కాదు, మీ మీద ప్రేమతో, దయతో భగవంతుడు ఈ మాటలు చెపుతున్నాడు. ఈ సంసారం అనే దావాగ్నిలో నుండి, ఈ ప్రకృతిలో నుండి బయటకు రావాలంటే మీరు సాధన చేయండి, మీరు ప్రయత్నం చేయండి. మీ సాధనతోపాటు, మీ ప్రయత్నంతో పాటు గురువు అనుగ్రహం ఉంటే, ఈశ్వరానుగ్రహం ఉంటే ఈ ప్రకృతిలో నుండి బయటకు వచ్చేస్తారు, భగవంతుడు తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. అట్టిది గురువు అనుగ్రహం, అట్టిది ఈశ్వరానుగ్రహం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-01-2007, పెదకాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచి పెట్టవద్దు అని పరమాత్మ చెప్పాడు. మనం స్వార్థం లేకుండా, కర్తృత్వం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. మీకు ఉన్న ధనాన్నికాని, తెలివినికాని, అధికారాన్ని కాని ఇలా భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సమాజ శ్రేయస్సుకోసం ఉపయోగిస్తూ ఉంటే అది అంతా యజ్ఞమే. మీలో ధనవంతులు ఎవరైనా ఉంటే ఆర్థికంగా వెనుకబడిన వారికి రజోగుణంతో కాకుండా, తమోగుణంతో కాకుండా, సాత్వికబుద్ధితో సహాయ సహకారములు అందిస్తే అది దానం. అంటే మనం ఏదైనా ఇచ్చేటప్పుడు మంచి హృదయంతో ఇస్తే స్వీకరించినవారు సుఖపడతారు, మనం సుఖపడతాము. శరీరము, ఇంద్రియాలు, మనస్సు వీటిని స్వాధీనం చేసుకోవటానికి మనం చేసే సాధన అంతా కూడా తపస్సు. మనస్సును ఎండింపచేయటం తపస్సు. లోకసంక్షేమం కోసం భగవంతుడు అనేక అవతారాలు ధరించాడు. అందులో కూర్మావతారం ఒకటి. ఈ పెదకాపవరంలో భగవంతుడు కూర్మావతారంలో వెలిసాడు, ఇక్కడ స్వామి వారిని దర్శించకుండా ఎవరూ వెళ్ళవద్దు. మనకు ఈశ్వరుడి పట్ల భక్తి కుదిరితే, నిష్ఠ కుదిరితే మానసికఆరోగ్యం వస్తుంది, శారీరకఆరోగ్యం వస్తుంది. సర్వేశ్వరుడి పట్ల ఆ భక్తి కుదరటం కష్టం. పరమేశ్వరుడు విష్ణురూపంలో ఉండవచ్చు, శివరూపంలో ఉండవచ్చు. ఆయన ఏ రూపంలో ఉన్నా ఆయనను ఉపాసన చేసి, మన హృదయంలో నిలబెట్టుకొని ఆరాధిస్తూ తరించవలసిన అవసరం జీవకోటికి ఉంది. భక్తి, విశ్వాసం, ధ్యానం. మనకు ముందు భక్తి కలగాలి, భక్తి కలిగితే విశ్వాసం పెరుగుతుంది. విశ్వాసం పెరిగితే ఆ రూపాన్ని ధ్యానం చేస్తాము.

మీరు తరించటానికి భగవంతుడి అవతారాలలో ఏ రూపం మీకు ఇష్టం అయితే ఆ రూపాన్ని మీరు ధ్యానం చేయవచ్చు. ఒక్క విషయం మీరు గుర్తు పెట్టుకోండి. భగవంతుడితో మనకు ఉన్న సంబంధం తప్పించి మిగతావి అన్నీ నూటికి నూరుపాళ్ళు అబద్ధం. ఈ శరీరం ఎంత తాత్కాలికమైనదో, బంధుత్వాలు కూడా అంతే తాత్కాలికమైనవి. స్నేహాలు, విరోధాలు కూడా తాత్కాలికమైనవే. ఇవన్నీ నామరూపముల మీద ఆధారపడిన విషయాలు. మాయ

అంతా మనస్సులోనే ఉంది. మీకు ఎప్పుడైనా సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అది మన శరీరానికి రాదు, మన కాళ్లకు చేతులకు రాదు, మనస్సుకు వస్తుంది. ఎప్పుడైనా కోపం వచ్చినా, ద్వేషం వచ్చినా అదీ మనస్సుకే వస్తుంది. మనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన దర్శనం అవ్వకుండా మన మనస్సే మనకు అడ్డు వస్తోంది. అందుచేత మనస్సు అణగాలి. మనం పుట్టినప్పుడే దేవుడు వచ్చాడు, మనం చనిపోయాక దేవుడు ఉండడు అని అనుకోకు. ఈ జీవకోటి అంతా ఆయనలో నుండే వచ్చింది. ఈ జీవకోటి అంతా ఎవరిలో నుండి అయితే వచ్చిందో ఆయనతో ఉన్న సంబంధం ఒక్కటే నిజమైన సంబంధం, మిగతావి అన్నీ అబద్దాలే. మనకు కర్మఫలం పట్ల కాంక్ష ఉంది, దేహాభిమానం ఉంది, ఈ రెండూ కూడా భగవంతుడి వైపుకు మన ముఖాన్ని తిరగనివ్వవు. ఆత్మజ్ఞాన సముపార్జనకు ఇవి రెండూ ఆటంకాలు. ధర్మం అంటే ఒక జీవిత విధానం. ఎలా జీవిస్తే మనకు మోక్షం వస్తుందో ఆ రకంగా జీవిస్తే అది ధర్మం. సనాతనధర్మం అంటే మన ధర్మం ఇవాళ ఎవరో ప్రారంభిస్తే వచ్చినది కాదు, ఎవరో కనిపెడితే వచ్చినది కాదు, చిరకాలం నుండి కలకాలం నుండి ఉన్నదే ఈ ధర్మం. పూర్వం మడి, ఆచారాలు ఉండేవి. ఆహార నియమం ఉండేది. ఇవన్నీ మన పెద్దలు ఎందుకు ఏర్పాటు చేసారు అంటే ధర్మం యందు గౌరవం కలగటంకోసం ఇవన్నీ ఏర్పాటు చేసారు. ధర్మ, అర్థ, కామ, మోక్షములలో ముందు ధర్మమే ముఖ్యము. ధర్మాన్ని ఆచరించకుండా మీకు మోక్షం రాదు. మీరు భగవద్గీత, ఉపనిషత్‌లు చదివేస్తే మోక్షం వచ్చేయదు. శరీరానికి క్రమశిక్షణ ఉండాలి, మనస్సుకు క్రమశిక్షణ ఉండాలి. ఎక్కడో దేవుడు, స్వర్గము, నరకము, ఆలోకము, ఈలోకము గొడవలు వదిలెయ్యండి. చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గొడవలు వదిలెయ్యండి. జీవిత విధానంలో మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం బాగాఉండాలంటే, మనస్సు నిశ్చలంగా నిర్మలంగా ఉండాలంటే, మీరు బతికిన పదిరోజులు సుఖమయంగా ఉండాలంటే భక్తి అవసరం. స్వస్వరూప అనుసంధానమే భక్తి. ఉపనిషత్‌లు అన్నీ ఋషుల యొక్క అభిప్రాయాలు, భగవంతుడి ముఖంలో నుండి వచ్చిన శాస్త్రం భగవద్గీత. మనం నేర్చుకొన్నది ఎలా ఆచరించాలి అని ఆచరణ భాగం అంతా భగవద్గీతలో సమన్వయం చేసాడు. ప్రపంచంలో లేనిది భగవద్గీతలో ఉండవచ్చు కాని భగవద్గీతలో లేనిది ఈ ప్రపంచంలో ఏమీ లేదు. కర్మయోగం అంతా మనం సత్కర్మ ఎలా ఆచరించాలి, మంచిని ఎలా

పెంచుకోవాలి, సమాజశ్రేయస్సు కోసం ఎలా జీవించాలి అని ధర్మం గురించి అంతా కర్మకాండలో చెప్పాడు. జ్ఞానకాండలో బ్రహ్మం యొక్క విశిష్టత అంతా చెప్పాడు.

మనకు ఎంతసేపు ఏదో రోజున స్మశానంలో దహించబడే ఈ దేహం గొడవే కాని అసలు లోచూపు మనకు లేదు. అసలు మనం ఎక్కడ నుండి వచ్చాము, ఎక్కడికి వెళ్ళాలి అనే విచారణ లేదు, భగవంతుడిని పొందాలి అనే జిజ్ఞాస లేదు. శ్రవణం లేదు, మననం లేదు, ధ్యానం లేదు. కంచిలో చీరలు నచ్చలేదు, బెనారస్‌లో చీరలు నచ్చలేదు, చీర ఇలా ఉండాలని ఆర్డర్ ఇచ్చి వచ్చాము అని చెపుతారు. ఈ శరీరాన్ని కప్పుకోవటానికే ఇంత గొడవ అయితే ఇంక నీకు జ్ఞానం ఏమిటి? మీరు వంద రూపాయలు సంపాదిస్తే కనీసం పది రూపాయలు సమాజానికి ఉపయోగించాలి. మనం సమాజంకోసం ఏమీ చేయటం లేదు, దయాగుణం మనకు లేదు. స్వార్థాన్ని విడిచిపెట్టి నీ జీవితంలో ఒక్కరికైనా సహాయం చేసావా? ఏమీ లేదు. ఆచరణ భాగం సున్నా. ఏదో పుస్తకం చదవటం, బ్రహ్మజ్ఞానం వచ్చేయాలి అనుకోవటం, అలా రాదు అని చెపుతున్నాడు. పరమేశ్వరుడు ఒక మాట చెపితే ఆ మాట ఏ హృదయంతో చెప్పాడో అది మనకు అర్థం అవ్వాలి, దానిని అనుభవించాలి, ఆ మాటను మనం ఎంజాయ్ చెయ్యాలి. మాట దేవుడై ఉన్నది. మనకు ఎంతసేపు రూపబుద్ధి, నామబుద్ధి. ఇవి అన్నీ టెంపరరీ. కీర్తి నిలబడదు, అపకీర్తి నిలబడదు, గౌరవాలు నిలబడవు, ధనం నిలబడదు, లాభం నిలబడదు, నష్టం నిలబడదు. ఏదైతే తాత్కాలికమో దాని చుట్టూ తిరుగుతూ జీవితాన్ని వృథా చేసుకొంటున్నాము. రూపం అబద్ధం, నామం అబద్ధం. ఏదో శవం వస్తుంది, దానికి పేరు పెడతారు. ఆ శవం చుట్టూ, పేరు చుట్టూ తిరగడం. ఇంక మనస్సు ఎప్పుడు లోపలకు వెళుతుంది. మనలను బంధించేవి నామరూపములే, ఈ వలలో నుండి బయటకు రాలేకపోతున్నాము.

భగవంతుడు అనేక నామరూపములతో వస్తాడు. మనకు ఇష్టమైన నామాన్ని స్మరించుకొంటూ, ఆ రూపాన్ని ధ్యానం చేస్తే మన నామరూపముల నుండి విడుదల పొందుతాము. ఈ ప్రపంచానికి మనం దగ్గరయ్యే కొలది భగవంతుడికి దూరం అవుతాము. ఈ ప్రపంచంలో మనం చేయవలసిన పని చేసి వదిలేయాలి. మన డ్యూటీ మనం చేయాలి, 24 గంటలు ప్రపంచ విషయాలలో ఉండకూడదు. పరమేశ్వరుడిని స్మరించి, ఆయనను ధ్యానించి మనలో ఉన్న జీవలక్షణాలను పోగొట్టుకోకపోతే దైవస్వరూపం మనకు దొరకదు,

జననమరణ చక్రంలో నుండి మనం బయటకు రాలేము. భగవద్గీతలో గుణాల గురించి ఎక్కువ చెప్పాడు. తమోగుణం ఉన్నవాడు ఎప్పడూ డల్‌గా ఉంటాడు, ఎప్పడూ తిండి, నిద్ర గొడవలో ఉంటాడు. రజోగుణం ఉన్నవాడు కోరికలతో ఉంటాడు. కోరికతో పని చేస్తాడు. ఈ పని చేస్తే మనకు ఏమి కలిసివస్తుంది అని చూస్తాడు. వాడి కోరికలే వాడిని బంధిస్తూ ఉంటాయి. సత్వగుణం అంటే మంచితనం, వివేకం. ఇలా ఏవో మంచిమాటలు వింటాము అనుకోండి. ఇది మంచి, ఇది చెడ్డ అని మనకు తెలుస్తూ ఉంటుంది, అదే వివేకం. వివేకం మంచిదే కాని వివేకం ఉన్నవాడు ఎప్పడు ఆచరిస్తాడు అంటే ఈశ్వరుడి దయ వలన వాడికి వైరాగ్యం వస్తే ఆచరించటం ప్రారంభిస్తాడు. కొంతమంది భార్య ఉన్నతంసేపు భార్య చుట్టూ తిరుగుతారు, భార్య చనిపోయాక కొడుకులు, కోడళ్ళు పట్టించుకోరు, అప్పడు కొంత వైరాగ్యం వచ్చి మంచి పనులు చేస్తారు. కొంతమంది ఇంట్లోవారి మీద కోపంతో మంచి పనులు చేస్తారు. ఇదంతా వివేకంతో చేస్తున్నారు అని చెప్పలేము. ఈ లోకం మీరు చేసే పనులు చూస్తుంది కాని భగవంతుడు మీరు ఏ ఉద్దేశ్యంతో ఆ పనులు చేస్తున్నారో చూస్తాడు, దానిని బట్టి మీకు స్పిరిట్యువల్ స్టేటస్‌ను ఇస్తాడు, వాడు అంతర్యామి. వివేకం వలన వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది కాని కోపం వలన వచ్చిన వైరాగ్యం నిలబడదు. ఇది మంచిపని అని మనకు తెలిసినా ఆ పని మనం చెయ్యలేము, వాసన యొక్క వేగం మనలను చెయ్యనివ్వదు. మనకి ఏ తలంపు వస్తే ఆ క్షణంలో అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తుంది, తలంపు యొక్క వేగం అట్టిది, మనం ఏ రకంగా పని చెయ్యాలి, ఎలా జీవిస్తే మనం బాగుపడతాము, భక్తిని ఎలా పెంచుకోవాలి, ప్రేమను ఎలా పెంచుకోవాలి ఇవిఅన్నీ భగవంతుడు చెప్పాడు. ఇక్కడ మన తలకాయ అనవసరం. భగవంతుడు ఇది మంచి అని చెపితే చేసేయటం, ఇది చెడ్డ అని చెపితే దానిని వదిలేయటం. మీలో ఎవరికైనా దుఃఖం వస్తోంది అనుకోండి. ఫలానా రకంగా వారు ప్రవర్తించారు అందుచేత వారికి దుఃఖం వస్తోంది అని ఆరకంగా మనం ప్రవర్తించటం మానివేయాలి. ఎందుచేతనంటే మనం అదేరకంగా ప్రవర్తించాము అనుకోండి, మనకు కూడా దుఃఖం వచ్చేస్తుంది. భగవంతుడు చెప్పిన పనిని మనం చేస్తూ ఉంటే మీరు ఈ లోకంలో సుఖపడటమే కాదు, శాంతిగా ఉండటమే కాదు, భగవంతుడి స్వరూపమైన మోక్షం కూడా పొందుతారు. భగవంతుడు వద్దని చెప్పిన పనిని చేస్తూ ఉంటే నీచజన్మలు వస్తాయి, చివరకు మనకు నరకమే గతి. ధర్మం ఎటువంటిది అంటే మీరు ధర్మాన్ని ఆచరిస్తే

మోక్షాన్ని రుచిచూస్తారు అని గౌతమబుద్ధుడు చెప్పాడు. సముద్రం నీరు నోటిలో పోసుకొంటే ఉప్పగా ఉండటం ఎంత సహజమో ధర్మాన్ని ఆచరించేవాడు మోక్ష సుఖాన్ని, నిర్వాణసుఖాన్ని రుచి చూడటం కూడా అంతే సహజం అని బుద్ధుడు చెప్పాడు. ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారశుద్ధి లేకుండా బుద్ధి శుద్ధి అవ్వదు. ఏదో ప్రాణాయామం చేస్తున్నానని ఏ గడ్డి పడితే ఆ గడ్డి తినేస్తూ ఉంటే దాని వలన ఆధ్యాత్మికపురోగతి ఆగిపోతుంది. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇప్పడు మనం మాట్లాడుతున్నాము అనుకోండి. అవసరం ఉండి మాట్లాడుతున్నామా లేకపోతే అహంకారం పెంచుకోవటానికి మాట్లాడుతున్నామా అని మనం చూసుకోవాలి. అవసరం లేకుండా మాట్లాడుతూ ఉంటే శక్తి వృధా అవుతుంది. నీవు మాట్లాడుతూ ఉంటే నీ ప్రక్కవాడికి ఆ మాట ఉపయోగపడాలి, వాడు బాగుపడటానికి ఆ మాట సహకరించాలి. నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అతినిద్ర పనికిరాదు. కొంతమంది సహజంగా పనిచేస్తారు, సహజంగా జీవిస్తారు, కృత్రిమంగా మాట్లాడరు, గర్వం ఉండదు, మాటచేత అన్నీ నిరాడంబరంగా ఉంటాయి. మనం చెప్పేమాట ఎదుటివాడికి ఎంతవరకు ఉపయోగపడుతోంది అని ఆలోచిస్తూ వాడి స్థాయికి దిగివచ్చి మాట చెపుతారు. ఇదంతా సత్వగుణం ఉన్నవాడి లక్షణం. ఏవో పాండిత్యం మాటలు చెప్పటం కాదు ఎదుటివాడికి అర్థమయ్యేలాగ, వాడి క్షేమం కోరి మాటలు చెప్పాలి. నువ్వు బాగుపడటానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నావో వాడు బాగుపడటానికి కూడా అంత ప్రాముఖ్యత ఇచ్చి చెప్పాలి. వాడు నీతో సమానస్థాయికి వస్తే నువ్వు సంతోషించాలి కాని నేను ఏదో ఉద్ధరిస్తున్నాను అని అనుకోకూడదు.

కర్మఫలితానికి నీవు కారకుడవు అవ్వకుండా చూసుకో. కర్మఫలితానికి నువ్వే కారకుడవు అనుకొంటే జన్మలు పెరిగిపోతాయి, ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. కర్మఫలితం పట్ల ఆసక్తి పెట్టుకోవద్దు, అలాగని చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టవద్దు. కర్మని యోగంగా చేస్తే నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. ఒక మనిషి మీద మనకు ప్రేమ ఉంది అనుకోండి, ఆ ప్రేమకు కారణం కనబడకూడదు, అప్పడు అది నిజమైన ప్రేమ. కారణం ఉంటే ఆ కారణం నెరవేరినప్పడు ప్రేమ కూడా పోతుంది. పరమేశ్వరుడిపట్ల ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి, కారణం కనబడకూడదు, అది భక్తియోగం, అప్పడు నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. మనిషి పాడైపోవటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వాటిని తట్టుకోవటానికి సత్పురుషులతో సహవాసం చెయ్యి. మహాత్ముల దగ్గరకు, యోగుల దగ్గరకు వెళ్ళినప్పడు తీర్పులు చెప్పవద్దు,

వారి దగ్గర నుండి నేర్చుకొని బాగుపడండి. కృష్ణుడు అట్టివాడు, ఇట్టివాడు అని ఆయన మీద జడ్జిమెంట్స్ చెపుతూ ఉంటే భగవద్గీత మీకు ఏమి అర్థమవుతుంది. ఇప్పుడు నీకు దేహంతోటి, మనస్సుతోటి ఎరుక ఎలా ఉందో అలాగ నీ లోపల ఉన్న సద్వస్తువుతో ఎరుక కలిగే వరకు బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. కర్మఫలితం మీద ఆసక్తి పెట్టుకోవద్దు, అలాగని కర్మని విడిచిపెట్టవద్దు అని మీకు మాటలు చెపుతూ ఉంటే మీకు తలుపు సందున పెట్టి నొక్కినట్లుగా ఉంటుంది. ఈ రకంగా జీవిస్తేనే మనలో ఉన్న అజ్ఞానం పోతుంది, ఈశ్వరుడు మనకు వ్యక్తమవుతాడు. లోపల ఉన్న విషం, కల్మషం అంతా బయటకు పోవాలి కదా. కర్మఫలితానికి కారకుడవు అయ్యావా, ఒకవేళ నీవు మంచిపని చేస్తున్నా పతనం ప్రారంభమవుతుంది. మన మనస్సులో అనేక బలహీనతలు ఉన్నాయి అనుకోండి. ఆ బలహీనతల నుండి ఎలా విడుదల పొందాలి, ఏ రకంగా జీవిస్తే ఆ బలహీనతలు నశిస్తాయి అనేది మనకు భగవద్గీతలో దొరుకుతుంది. ఆధ్యాత్మికంగా మీకు ఏవైనా సందేహాలు వస్తూ ఉంటే, సాధన చేసేటప్పుడు సందేహాలు వస్తూ ఉంటే ఏదో ఒక శ్లోకం మీ సందేహాన్ని నివృత్తి చేస్తుంది, భగవద్గీత యొక్క వైభవం అట్టిది. ఆసక్తి పెట్టుకోకుండా పనిచెయ్యి, అనురాగం పెట్టుకోకుండా పనిచెయ్యి, అప్పుడు నీవు నిర్మలమవుతావు, నిశ్చలమవుతావు. నీ మనస్సు నిర్మలమయ్యేకొలది, నిశ్చలమయ్యేకొలది, లోపల ఉన్న జ్ఞానగంగ నీకు దొరికేకొలది నీలో ఉన్న వాసనలు ఒకో వాసన, ఒకో వాసన నశిస్తాయి. ఎప్పుడైతే వాసనాక్షయం అయ్యిందో ఈ శరీరంలో ఉండగానే నువ్వు నిర్వాణసుఖాన్ని పొందుతావు.

మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఈ శరీరానికి మరణం వచ్చే రోజుకు నూటికి నూరుపాళ్ళు సుఖంగా, ఆనందంగా ఉంటే వాడికి పునర్జన్మ లేదు. ఎందుచేతనంటే వాడికి ఏడ్చేపనిలేదు. ఏడుపు మిగిలిఉంటే ఏడవటానికి మరల జన్మను ఇస్తాడు. మీకు దుఃఖం అంతా ఖర్చు అయిపోయింది అనుకోండి ఇంక శరీరంలోనికి రావలసిన పనిలేదు. మొన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఎవరో పాట పాడారు. ఏటిగట్టు వంకరలు, వంకరలుగా ఉన్నా నీరు వంకరగా ఉంటుందా అని, దాని అర్థం ఏమిటి అంటే నీ దేహం వేరుగా ఉండవచ్చు, నా దేహం వేరుగా ఉండవచ్చు, మీ గుణాలు వేరుగా ఉండవచ్చు, నా గుణాలు వేరుగా ఉండవచ్చు, రంగులు వేరుగా ఉండవచ్చు కాని అందరి హృదయాలలో ఉన్న పరమేశ్వరుడు వేరు వేరుగా లేడు, ఒకటిగానే ఉన్నాడు. మన గుణాలు వేరుగా ఉన్నా

మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడు సమానంగానే ఉన్నాడని చెప్పటం. మంచివాడిలో ఏ పరమేశ్వరుడు అయితే ఉన్నాడో చెడ్డవాడిలో కూడా ఆ పరమేశ్వరుడే ఉన్నాడు. చెడ్డవాడి యొక్క మనస్సు వంకరగా ఉంది కాని వాడిలో ఉన్న పరమేశ్వరుడు వంకరగా లేడు. మంచి వాడికి చెడ్డవాడికి తేడా ఏమిటి అంటే మంచివాడికి వాడిలో ఉన్న పరమేశ్వరుడు అనుభవం లోనికి వస్తాడు, వాడు సుఖి అవుతాడు. చెడ్డవాడికి హృదయంలో ఉన్న పరమేశ్వరుడు వాడికి దొరకడు, అందుచేత దుఃఖం వాడిని విడిచిపెట్టదు. మీ మనస్సు కదులుతోంది అనుకోండి అక్కడ ఇష్టం అయినా, అయిష్టం అయినా ఉంటుంది. మీకు ఇష్టం లేదు అనుకోండి, అయిష్టం లేదు అనుకోండి మీ మనస్సు కదలమన్నా కదలదు.

మొత్తం సొత్తు అంతా భగవంతుడిదే. ప్రారబ్ధాన్ని బట్టి మనకు కొంత కేటాయించాడు. ఆ కేటాయించినది కూడా ఆయనదే. ఆయన ఇచ్చినది మనం అనుభవిస్తున్నాము. మనం తినే అన్నం కూడా మన సొంతం కాదు. ఆయన ఇచ్చినదే మనం తింటున్నాము, అలా అనుకొని తింటే అది ప్రసాదమవుతుంది. అది పరమేశ్వరుడిది కాదు, నాది అనుకొని తింటే నువ్వు దొంగతోటి సమానము. మన సొంతం అంటూ ఏమీ లేదు. అంతా ఈశ్వరుడిదే. మొత్తం ఈ సృష్టి రూపంలో ఉన్నవాడు ఆయనే. మనచేత చూడబడుతున్న ప్రపంచం కూడా ఈశ్వరుడే. అయితే ట్రైనింగ్ పొందటం కోసం మనం ఇక్కడకు వచ్చాము అని గుర్తు పెట్టుకోవాలి. బాధపడే వాడిని చూసి అయ్యో అని కూడా అనలేవు, నాకు దయ ఉంది అనుకొంటావు. అలాకాదు నీవు దయను ప్రాక్టీసు చేయాలి. అందరి జీవితాలు, లోకం యొక్క పోకడ అంతా కూడా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. ఇదంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని మీకు అనుభవానికి వస్తే ఇంక ఏ విషయంలోను అశాంతి ఉండదు. తేడా అల్లా నామరూపములే, ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే అని మీకు అర్థమైతే మీ సాధనతో నిమిత్తం లేకుండా ఇప్పుడే అశాంతి నశిస్తుంది, దుఃఖం నశిస్తుంది. మాలో ఈ మంచిగుణాలు ఉన్నాయి, ఆ మంచిగుణాలు ఉన్నాయి అని మీలో మీరు గాలిమేడలు కట్టుకోవద్దు. ప్రాక్టీసు చేస్తే మీరు ఫెయిల్ అయిపోతారు. భగవద్గీతలో చెప్పిన వాక్యాలను తీసుకొని ప్రాక్టీసుచేయటం మొదలుపెడితే అందులో ఉన్న ఇబ్బంది, వాటి యొక్క లోతు ఏమిటో అప్పడు మీకు తెలుస్తుంది. ఈలోకం వేరు, నేను వేరు, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని మనకు అనిపిస్తుంది. ఇదంతా మనస్సు యొక్క గారడీ, ఇదంతా మనస్సు యొక్క

కల్పితమే. నీ మనస్సు వెళ్లి బ్రహ్మంలో ఐక్యంఅయ్యాక నీకు ఉన్న బేదబుద్ధి నశిస్తుంది, బ్రహ్మం కంటే భిన్నంగా ఏదీ లేదు అన్న సంగతి బ్రహ్మానుభవం కలిగాక నీకు తెలుస్తుంది. అప్పుడు జీవించి ఉండటానికి, మరణించటానికి మధ్యన ఉన్న బేధం నశిస్తుంది.

భగవంతుడు ఒకో శరీరానికి ఒకో పనిని కేటాయిస్తాడు. మన శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని హృదయపూర్వకంగా నిండుమనస్సుతో, అయిష్టం లేకుండా ఇష్టంతో కనుక చేస్తే అప్పుడు ధర్మం మనలను రక్షిస్తుంది. ఎవడికైతే ధర్మంయందు గౌరవం ఉందో, ఎవడైతే ధర్మాన్ని కాపాడుతున్నాడో వాడినే ధర్మం రక్షిస్తుంది. ధర్మం యందు గౌరవం లేనివాడిని ధర్మం రక్షించదు. కర్ణుడి రథచక్రం దిగిపోతుంది, దానిని తీసుకొంటూ ఉంటాడు, అలా ఉండగా వాడిని చంపేయమని కృష్ణుడు అర్జునుడితో చెపుతాడు. అప్పుడు కర్ణుడు ధర్మశాస్త్రం గురించి చెపుతాడు. అప్పుడు కృష్ణుడు ఏమన్నాడు అంటే నీవు నోటితో ధర్మం గురించి చెపుతున్నావు. నీకు ధర్మం యందు అసలు గౌరవం ఉందా, నిండుసభలో ద్రౌపది వస్త్రాలు వలిచినప్పడు తప్ప అని చెప్పావా? అభిమన్యుడిని అన్యాయంగా చంపినప్పడు తప్పని చెప్పావా? పాండవులను చాలా క్రూరంగా అగౌరవపరిచారు కౌరవులు, అప్పడు ఇది ధర్మ విరుద్ధం అని ఎప్పడైనా చెప్పావా? కౌరవులు చేసిన అన్ని అన్యాయపుపనులకు నువ్వు సిద్ధమయ్యావు. ఇప్పడు ధర్మశాస్త్రం గురించి చెపుతున్నావు. నీకు ధర్మంయందు గౌరవం ఉంటే నువ్వు ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే అర్జునుడు ఎవడు? నేను ఎవడిని? ధర్మమే నిన్ను రక్షిస్తుంది. అందరి విషయంలోను మీరు అధర్మంగా ప్రవర్తించి మీ సొంత విషయం వచ్చేటప్పటికి ధర్మం, ధర్మం అంటే ఆమాటకు అర్థం ఏమిటి? అదీ కృష్ణుడు చెప్పేది. కొంతమంది దగ్గరకు మనం ఏమీ తీసుకొని వెళ్లకపోయినా, వారు వచ్చి మనలను చూసి వెళ్లారు కదా అని తృప్తిపడతారు. మన చేతిలో ఆకు లేకపోవచ్చు, నీరు లేకపోవచ్చు, అలాగే భగవంతుడిని దర్శించుకొని రావటం వలన కూడా మనకు సద్బుద్ధి కలుగుతుంది. మనం పవిత్రులమవుతాము. జీవితంలో మనం నేర్చుకోవలసినవి రెండే రెండు విషయాలు 1. చేతులతో మంచి పనులు చేస్తూ ఉండాలి, 2. మనస్సుతో భగవంతుడిని స్మరించుకొంటూ ఉండాలి. అలా ఉంటే మనం పవిత్రులం అవుతాము. మన పవిత్రత బ్రహ్మజ్ఞానం పొందటానికి దారి చూపిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 09-03-07 శుక్ర | జిన్నూరు, రమణ క్షేత్రం |
| 11-03-07 ఆది | చించినాడ, గీతామందిరం |
| 18-03-07 ఆది | పాలకొల్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్, బస్టాండ్ వెనుక (మధ్నాహ్నం 3 గంటలకు) |
| 28-03-07 బుధ | గొల్లలమామిడాడ, తూర్పు గోదావరి జిల్లా |
| 31-03-07 శని | ముమ్మిడివరం, తూర్పు గోదావరి జిల్లా |
| 04-04-07 బుధ | గుండుగొలను |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## క్రోధానికి కోత, అనుగ్రహానికి దాత "గురు స్వరూపం"

జీవుడు తరించే యోగం తటస్థిస్తే సద్గురువుతో ఈశ్వరుడు అనుసంధానం చేస్తాడు. సంస్కారాలు పూర్తిగా నిర్మూలించటం ఇది సద్గురువు కరుణా కటాక్షం ద్వారా జరుగుతుంది. గుడ్డివాడు సూర్యోదయమును ఎదురుగా ఉన్ననూ చూడలేనట్లే. అలాగే అదృష్టం లేనివారు గురువు యొక్క శ్రేష్ఠమైన రూపమును కానలేరు. పవిత్ర గ్రంధాలు ఆత్మానుభూతిని వివరిస్తాయి. మహాత్ములు మానవ రూపంలో ఉన్న పవిత్ర గ్రంధాలు. పవిత్ర గ్రంధాలు వారి నుండే వెలువడుతాయి. అంతకన్న వారు అధికులు కూడా వారు మోక్ష మార్గాన్ని చూపేవారే కాదు మోక్షాన్ని ఇచ్చేవారు కూడా వారే. శ్రీ నాన్నగారు "గురువు సాధన చెయ్యమని చెప్పడు, అనుగ్రహాన్ని ఇవ్వటమే. సముద్రానికి హద్దులు ఉన్నాయి, జ్ఞాని అనుగ్రహానికి హద్దులు లేవు. మనం ఎక్కడ ఉన్నా అందుతాయి. జ్ఞానితో మీరు మానసిక అనుబంధాన్ని ఏర్పాటు చేసుకోండి. ఒడ్డుకు చేరుస్తాడు. అది ఆయన పని" అన్నారు. గురు గీతలు "సద్గురువు యొక్క పాదములను తాకిన అన్ని పుణ్య క్షేత్రాలు దర్శించిన ఫలం, అన్ని నదులలో స్నానం చేసిన ఫలం కలుగుతుంది. ఎల్లప్పుడు గురు నామాన్ని జపించు, గురు రూపాన్ని చింతించు. గురువు యొక్క ఆజ్ఞా ప్రకారం నడవాలి. ఆపద వచ్చినప్పుడు సర్వ ధర్మ స్వరూపుడైన గురువే బిందువుగా అగుచున్నాడు. గురు పాదమే పూజించుటకు యోగ్యము. గురు వాక్యమే మంత్రము. ఈశ్వరుడు అనుగ్రహించినను గురువు కనికరించి రక్షిస్తాడు, గురువు ఆగ్రహిస్తే ఈశ్వరుడు కూడా రక్షించలేడు" అంది. నిజం ఏమిటి అంటే సద్గురువు కటాక్షం చేతనే బంధాలు అన్ని నశించి పోతాయి. శ్రేయములు అన్నీ స్వయంగా వచ్చి చేరుతాయి. గురువు యొక్క ఉపదేశము లేకున్నచో కోట్ల కల్పములైనను తత్వ జ్ఞానం కలుగదు. మనచేత గురువు నామమాత్రంగా సాధన చేయించి, కామాదులను నశింపచేసి ముక్తిని ప్రసాదిస్తారు. కామానికి వాత, క్రోధానికి కోత పెట్టి తన అనుగ్రహంతో తన అంతవానిగా చేస్తాడు. త్రిమూర్తుల స్వరూపమే గురు స్వరూపము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం



ది॥ 05-02-07న పాలమూరు కళ్యాణ మండపం ప్రారంభించిన మాజీ మంత్రి
చింతలపాటి మూర్తిరాజుగారు మరియు సద్గురు శ్రీ నాన్నగారు



పాలమూరు సభకి సద్గురు శ్రీ నాన్నగారిని ఆహ్వానిస్తున్న
రిటైర్డ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ కలిదిండి నర్సింహరాజుగారు